సాక్షి
బాపట్ల
శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



ఈవీఎం గోడౌన్ పరిశీలన

లక్ష్మీపురం: గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని గోడౌన్ భద్రపర్చిన ఈవీఎంలను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం పరిశీలించారు. ఆమె వెంట అధికారులు ఉన్నారు.



అమ్మవారి హుూండీ లెక్కింపు

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో కానుకల హుండీ లెక్కించగా నాలుగు నెలలకు రూ.8,30,922 ఆదాయం వచ్చినట్లు అధికారులు గురువారం తెలిపారు.

నేడు కోటి పడగల పుణ్యక్షేత్రం మహోత్సవం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కోనేటిపురంలోని కోటి పడగల పుణ్యక్షేత్రమైన వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వస్వామి దేవస్థానం షష్టి పూర్తి వార్షిక మహోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వంగర చలమయ్య సిద్ధాంతి, జొన్నా వెంకటరత్నం పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

తెగి పడిన హై టెన్షన్ విద్యుత్ వైరు



వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరిపట్నంలో హై ఓల్టేజీ విద్యుత్ వైరు బుధవారం రాత్రి తెగి గృహాలకు విద్యుత్ సరఫరా చేసే స్తంభాలపై పడింది. దీంతో ఆ ప్రాంతంలోని గృహాలకు హై ఓల్టేజీ సరఫరా కావడంతో విద్యుత్ మీటర్లు, ఫ్రిజ్‌లు, మోటార్లు, ఫ్లాన్లు, టీవీలు కాలిపోయాయి. ఆ ప్రాంతంలో భారీగా నష్టం వాటిల్లింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కేపాల్ కాలనీలోని గృహాల మధ్య నుంచి హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. వర్షాలు కురిన సమయంలో ఎటువంటి సమస్య వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ఇళ్ల మధ్య నుంచి వెళుతున్న హై టెన్షన్ లైన్‌ను తొలగించి దూరంగా వేయాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు

చుండూరు (కొల్లూరు): వైఎస్సార్ సీపీ రాష్ట్ర వలంటీర్ వింగ్ సెక్రటరీగా చుండూరు మండలం చిన్నగాదెలవర్రుకు చెందిన గాదెలవర్తి సుధీర్‌ను నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా కొల్లూరు మండల మాజీ ఎంపీపీ పెరికల పద్మారావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి.

పశ్చిమ డెల్టాకు 5,007 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం 5,007 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12.5 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కు138, బ్యాంక్ కెనాల్ 1,241, తూర్పు కాలువకు 547, పశ్చిమ కాలువకు 229, నిజాపట్నం కాలువకు 428, కొమ్మూరు కాలువకు 1,760 క్యూసెక్కులు విడుదల చేశారు. 4,16,622 క్యూసెక్కులు సముద్రంలోకి పంపుతున్నారు.

నేడు జీజీహెచ్ మెడికల్ బోర్డులో పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025 సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఈనెల 29న జీజీహెచ్ మెడికల్ బోర్డులో పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైకల్య నిర్ధారణ పరీక్షల నిమిత్తం జీజీహెచ్ మెడికల్ బోర్డుకు రూ.1500 చెల్లించాలని సూచించారు.

కొండలనూ మింగేస్తున్నారు..

- ట్రిప్పర్ రూ.10 వేలు, ట్రాక్టర్ రూ.3 వేలు వసూలు
- కూటమి బల్లికురవ మండల నేత దందా
- పట్టించుకోని మైనింగ్ అధికారులు
- మామూళ్లతో సరిపెట్టుకున్న స్థానిక అధికారులు

పర్చూరు, అద్దంకి కొండల నుంచి గ్రావెల్ అక్రమ రవాణా



మార్టూరు మండలం జంగమేశ్వరపురం ప్రాంతం నుంచి గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పచ్చనేతలు బరితెగించారు. కొండలనూ మింగేస్తున్నారు. పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ రాబడికి భారీగా గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోకపోగా పెద్దఎత్తున నెలవారీ మామూళ్లు పుచ్చుకొని అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదన్న ఆరోపణలున్నాయి.


జంగమేశ్వరపురం కొండలు పిండి

నిన్నటివరకూ ధర్మవరం కొండలను కొల్లగొట్టిన పచ్చనేతలు ఇప్పుడు పక్కనే ఉన్న మార్టూరు మండలం జంగమేశ్వరపురం కొండలను పిండి చేస్తున్నారు. యంత్రాలను ఉపయోగించి కొండలను తవ్వుతున్నారు. వంద ట్రిప్పర్లతో రోజుకు వేలాది ట్రిప్పుల గ్రావెల్‌ను అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు. ప్రధానంగా గ్రావెల్‌ను అద్దంకి ప్రాంతంలో నిర్మిస్తున్న అమరావతి జాతీయ రహదారితోపాటు పిడుగురాళ్ల– ఓడరేవు రహదారికి విక్రయిస్తున్నారు. మిగిలిన గ్రావెల్‌ను స్థానిక రియల్ వెంచర్లకు తరలించి అమ్ముకుంటున్నారు.

రోడ్ల నిర్మాణానికి ట్రిప్పర్ గ్రావెల్‌ను రూ.5 వేలకు విక్రయిస్తుండగా ఇతర ప్రాంతాలకు ట్రిప్పర్‌తో రూ.15 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఒక్క రోడ్డు పనికే రోజుకు వేలాది ట్రిప్పుల గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్‌ను దూరాన్ని బట్టి రూ.3 నుంచి రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. ఈ లెక్కన పచ్చనేత రోజుకు రాబడి రూ.లక్షల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

- మార్టూరు మండలంలోని ఇసుకదర్శి, వలపర్ల ప్రాంతాల్లో ఉన్న పచ్చని కొండలలను పిండిచేసి అక్రమంగా తరలిస్తున్నారు. కొండలతోపాటు సర్వే నంబర్ 558లోని ప్రభుత్వ భూముల నుంచి పచ్చనేత అక్రమంగా గ్రావెల్ తవ్వి అమ్ముకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

ప్రభుత్వ రాబడికి గండి



కొండను జేసీబీతో తవ్వుతున్న దృశ్యం

గత ప్రభుత్వంలో పర్చూరు నియోజకవర్గంలోని బొబ్బేపల్లి, కోలలపూడి, వలపర్ల, బొల్లాపల్లి ప్రాంతాల్లో పదుల సంఖ్యలో గ్రావెల్ లీజులు ఉండేవి. సదరు లీజుల నుంచి గ్రావెల్ తరలించి అవసరమున్న చోటుకు అమ్మేవారు. దీనివల్ల అటు ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం వచ్చేది. తద్వారా జిల్లాకు, మైనింగ్ పరిధిలోని గ్రామపంచాయతీలకు నిధులు సమకూరేవి. వాటితో అభివృద్ధి పనులు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లీజు క్వారీల్లో మైనింగ్ జరగకుండా నిలిపి వేయించారు. కూటమి సర్కారు కొలువు దీరే వరకూ పచ్చగా ఉన్న కొండలు పచ్చనేతల గ్రావెల్ దందాతో ఇప్పుడు తరిగిపోయి బోళ్లుగా మారిపోయాయి. గ్రావెల్ తరలింపుతో కొన్ని ప్రాంతాలు దాదాపు కనుమరుగయ్యాయి. అక్రమ గ్రావెల్ దందాతో ప్రభుత్వ రాబడికి రూ.కోట్లలో గండి పడుతోంది. అయినా సంబంధిత శాఖలు అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కొండలను పిండిచేస్తున్నా స్థానిక రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు. నెల మామూళ్లు పుచ్చుకుంటూ మైనింగ్ అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హంస వాహనా..వీడ్కోలు గజాననా..



బాపట్ల జిల్లాలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. గురువారం భక్తులు పెద్ద ఎత్తున గణనాథుడిని దర్శించుకున్నారు. భట్టిప్రోలు మండలం ఐలవరంలో హంస వాహనంపై గణనాథుడిని ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు. -సాక్షి నెట్ వర్క్

యూరియా కోసం రైతులు అగచాట్లు




కొల్లూరు మండలం గాజుల్లంక సొసైటీ వద్ద యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

నగరం: ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే రైతులు యూరియా కష్టాలను ఎదుర్కొంటున్నారు. బయట మార్కెట్‌లో బస్తా రూ.450 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. పీఏసీఎస్‌లు, రైతు భరోసా కేంద్రాలలో బస్తా రూ.267కే అందిస్తున్నారు. దీంతో రైతులు సొసైటీలు, ఆర్బీకేలకు వెళుతున్నారు. పెదపల్లి గొల్లపాలెం సొసైటీకి గురువారం యూరియా వచ్చిందని తెలియడంతో ఒక్కసారిగా రైతులు పెద్దసంఖ్యలో రావడంతో గందరగోళం నెలకొంది. టీడీపీ నాయకుల సిఫార్సులకే యూరియా ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు.

కొల్లూరు: గాజుల్లంక సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. గురువారం గాజుల్లంక పీఏసీఎస్‌కు 16.50 టన్నుల యూరియా సరఫరా అయ్యిందని తెలియడంతో కొల్లూరు, గాజుల్లంక, ఆవులవారిపాలెం, పెసర్లంక, పెదలంక, చింతర్లంక, సుగ్గునలంక, ఈపూరులంక గ్రామాల నుంచి రైతులు తరలివచ్చారు. రైతుల తాకిడి అధికమవడంతో పీఏసీఎస్ సిబ్బంది పాస్‌బుక్‌కు ఒక బస్తా చొప్పున పంపిణీ చేపట్టి చేతులు దులుపుకున్నారు.

తీర గ్రామాలకు మళ్లీ వరద ముప్పు



పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణమ్మ ప్రవాహం

రేపల్లె: ప్రకాశం బ్యారేజి నుంచి వరద నీరు దిగువకు వదులుతుండడంతో లంక గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం ఆయన పెనుమూడి వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం వరద ప్రభావిత ప్రాంతాలైన పెనుమూడి, పెనుమూడి పల్లిపాలెం, రావి అనంతవరం గ్రామాలలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. పరీవాహక గ్రామాలలో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఏదైనా సహాయం కోసం 77948 94544ను సంప్రదించాలని తెలియజేశారు. ఆయన వెంట వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భట్టిప్రోలు: ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు వరద నీరు విడుదల చేసినందున ఉధృతి పెరుగుతుందని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరుతోపాటు నది పరీవాహక లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



పెనుమూడి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కొల్లూరు: మండలంలోని చింతర్లంక, పోతార్లంక ప్రాంతాల్లోని పొలాల్లోకి తిరిగి వరద నీరు చేరుతుంది. దోనేపూడి కరకట్ట దిగువన లోలెవల్ వంతెనపైకి వరనీరు చేరే సూచనలు ఉండడంతో ఈ మార్గంలోని పోతార్లంక, తిప్పలకట్ట, తోకలవారిపాలెం, కిష్కింధపాలెం, జువ్వలపాలెం, తడికలపూడి గ్రామాల ప్రజలు మండలంలోని గాజుల్లంక, భట్టిప్రోలు మండలం వెల్లటూరు మీదుగా చుట్టు మార్గంలో రాకపోకలు సాగించాల్సి వస్తుంది. వరద తీవ్రత పెరిగితే పంటలకు నష్టం వాటిల్లుతుందన్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

జామ్..జామ్ జామాయిల్!

- జిల్లాలో రెండు వేల ఎకరాల్లో సాగు
- 12 ఏళ్ల పాటు దిగుబడి
- ఎకరాకు 20 టన్నుల నుంచి 60 టన్నుల వరకు వచ్చే అవకాశం
- ఎకరాకు రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం
- చవిటి భూములూ సాగుకు అనుకూలం



అద్దంకి ప్రాంతంలో సాగు చేసిన జామాయిల్ తోట

అద్దంకి: వరితో పాటు వాణిజ్య పంటలూ నష్టాలను తెస్తున్న తరుణంలో అన్నదాతలు వణికిపోతున్నారు. ఇక చౌడు భూములున్నా లేనట్లే. అయితే ఇలాంటి నేలలున్న రైతులకు యూకలిప్టస్ (జామాయిల్) సాగు అనుకూలంగా ఉంటుంది. కాగితం పరిశ్రమతో పాటు, రేయాన్ పరిశ్రమ, మెడికల్ రంగాల్లో దీనిని విరివిగా వాడుతుండటంతో జామాయిల్ కర్రకు గిరాకీ పెరిగింది. జిల్లాలో 2 వేల ఎకరాల్లో జామాయిల్ సాగు చేసిన రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

ఒక్కో మొక్క రూ.1 నుంచి రూ. 3

సంవత్సరానికి 400 మిల్లీ మీటర్ల నుంచి 12 వేల మిల్లీ మీటర్ల వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోని చౌడు, బీడు భూములతో పాటు, సారవంతమైన భూముల్లోనూ జామాయిల్ సాగు చేసుకోవచ్చు. జూన్, జూలై, ఆగస్టు నెలలు అనుకూలం. 400కు పైగా రకాలున్నప్పటికీ 3, 7, 316, 413 రకాల క్లోన్‌లను నాటుకోవచ్చు. ఎకరాకు 888 మొక్కలు అవసరం అవుతాయి. 25 నుంచి 30 అడుగుల ఎత్తు పెరుగుతాయి. ఈ మొక్కలు ఖమ్మం జిల్లాలో విరివిగా దొరుకుతుండగా.. రవాణా ఖర్చులతో కలుపుకుని మొక్క రూ.1 నుంచి 3 రూపాయల వరకు వ్యయం అవుతుంది.

నాలుగవ సంవత్సరం నుంచి కర్ర దిగుబడి..

నాటిన నాలుగో సంవత్సరం నుంచి కర్ర దిగుబడి వస్తుంది. ఎకరాకు సాధారణ భూముల్లో నీటి తడులు, ఎరువులు అందించిన తోటల్లో అయితే 40 నుంచి 60 టన్నుల మేర వస్తుంది. చౌడు భూములు, బీడు భూములు అయితే 30 నుంచి 40 టన్నుల వరకు కర్ర దిగుబడినిస్తుంది. అంటే ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.1.5 లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉన్నట్లే. తరువాత నాలుగు సంవత్సరాలకు ఒకసారి మొత్తం మూడు సార్లు కర్ర దిగుబడితో ఆదాయాన్ని ఇస్తుంది.

మార్కెట్ ఎలా ?

రైతు నేరుగా పేపర్ కంపెనీలకు లేదా, లైసెన్సు పొందిన కర్ర కొనుగోలు దారులకు కర్రను విక్రయించుకోవచ్చు. కర్రను కాగజ్ నగర్, భద్రాచలం, జేకే పేపర్ మిల్ వారు కొనుగోలు చేస్తున్నారు. చౌడు భూములు, బీడు భూముల్లో సాగు చేసుకోవడం ఉత్తతమని అధికారులు చెబుతున్నారు.

ఆదాయం బాగుంది..

సాధారణ పంటలు వేసి ఆదాయం లేక విసుగెత్తి జామాయిల్ సాగు చేశా. తెల్ల నేల కావడంతో మూడు సంవత్సరాలకే కొట్టుడు వస్తుంది. గతంలో ధర తక్కువగా ఉన్నా.. ఈ సంవత్సరం కర్ర ధర బాగుండడంతో టన్న ధర రూ.6 వేలు పలికింది. మంచి ఆదాయం వచ్చింది.

– హనుమంతరావు, రైతు

మెరిట్ లేని డీఎస్సీ!

- మెరిట్ కం రోస్టర్ జాబితా ప్రకటించకుండానే కాల్ లెటర్లు
- అర్హులైన జాబితా ప్రకటించే ఆనవాయితీకి మంగళం పలికిన విద్యాశాఖ
- గుంటూరులో ప్రారంభమైన డీఎస్సీ–2025 సర్టిఫికెట్ల పరిశీలన
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన 19 టీమ్‌లు
- ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపికైతే దరఖాస్తులో ఇచ్చిన ఆప్షనే అంతిమం
- పోస్టుల ఎంపికకు ఇప్పుడు అవకాశం లేక ఆందోళన చెందుతున్న అభ్యర్థులు
- ప్రభుత్వ నిర్ణయం మేరకే పోస్టింగ్ అంటున్న జిల్లా స్థాయి అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025 నోటిఫికేషన్ ఆధారంగా పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్, సబ్జెక్టుల వారీగా స్కూల్ అసిస్టెంట్లు, ఫిజికల్ డైరెక్టర్ తదితర పోస్టులకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల్లో మంచి మార్కులను సాధించి, పోస్టు ఖాయం అనుకున్న అభ్యర్థులు సైతం విద్యాశాఖ విధించిన నిబంధనలతో అయోమయంలో పడ్డారు. పోస్టింగ్ వస్తుందా, లేదా అనే సందేహాలతో సతమతం అవుతున్నారు. కాల్ లెటర్ వస్తేనే ఉద్యోగం, లేకుంటే కొలువు గల్లంతే అనే విధంగా కూటమి ప్రభుత్వం తీరు ఉంది.

19 బృందాలతో పరిశీలన

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డీఎస్సీ–2025 ద్వారా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను గురువారం గుంటూరు నగరంలోని ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలలో చేపట్టారు. మొత్తం 1,143 పోస్టులను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో చూపించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు 19 టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంకు కళాశాలలోని ఆడిటోరియంతోపాటు వేర్వేరు గదుల్లో 50 మంది చొప్పున అభ్యర్థులను కేటాయించారు. పాఠశాల విద్యాశాఖ నుంచి కాల్ లెటర్ అందుకున్న అభ్యర్థుల వారీగా డీఎస్సీ సైట్‌లో సర్టిఫికెట్లను విజయవంతంగా అప్‌లోడ్ చేసుకున్న వారినే వెరిఫికేషన్‌కు పిలిచారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల డీఈవోలు సీవీ రేణుక, చంద్రకళ, పురుషోత్తం పర్యవేక్షణలో టీమ్‌ల వారీగా నియమించిన అధికారులు సర్టిఫికెట్ల పరిశీలన జరిపారు. పరిశీలకురాలిగా కమిషనరేట్ నుంచి పి.శైలజ హాజరు కాగా, డీఆర్వో ఖాజావలి వెరిఫికేషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు.



గుంటూరులో అభ్యర్థుల సర్టిఫికెట్‌లు పరిశీలిస్తున్న అధికారులు

కాల్ లెటర్ వస్తేనే...

విద్యాశాఖ నుంచి కాల్ లెటర్ పొందిన అభ్యర్థులకే పోస్టింగ్ అని, లేదంటే రాదనే కోణంలో నియామక ప్రక్రియ మారిపోయింది. పోస్టులకు మెరిట్ కం రోస్టర్ ప్రకారం జాబితాను బహిరంగంగా ప్రదర్శిస్తే అభ్యర్థులు సాధారణమైన సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉండేది. కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. మరికొంత మంది తమకు కాల్ లెటర్లు రాకపోవడానికి కారణాలు తెలుసుకునేందుకు వచ్చా రు. ప్రతి పోస్టుకు మెరిట్ ప్రకారం ఇద్దరేసి అభ్యర్థులను ఎంపికచేసిన అధికారులు వెరిఫికేషన్ సెంటర్‌కు వచ్చిన వారి సర్టిఫికెట్లను పరిశీలన జరిపారు. 930 మంది సర్టిఫికెట్ల పరిశీలన గురువారం రాత్రికి పూర్తిచేసేందుకు నిర్ణయించారు.

అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ అందించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి పేర్కొన్నారు. సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ పలు అంశాలపై జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం కుసుమ్ పథకం కింద జిల్లాలోని 22 ఫీడర్లకు ఏడు సబ్‌స్టేషన్ల పరిధిలో 17 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి 82.5 ఎకరాల భూమిని రైతుల వద్ద నుంచి తీసుకుంటున్నట్లు తెలిపారు. సూర్యలంక బీచ్ దగ్గర ఉన్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కేంద్రానికి నీటి సరఫరాలో ఇబ్బందులు లేవని, 2015 సంవత్సరంలో మంజూరు చేసిన పనులలో 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 30 శాతం త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సదరం ధ్రువీకరణ పత్రాల పునఃపరిశీలనలో భాగంగా అర్హత ఉండి పింఛన్ నిలుపుదల అయిన లబ్ధిదారులు ఎంపీడీవోలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

దరఖాస్తు చేసుకున్న వారికి పింఛన్ ఇస్తామని తెలిపారు. వారి ధ్రువీకరణ పత్రాలను మరోసారి పునఃపరిశీలన చేస్తామని తెలిపారు. అనర్హులుగా తేలితే పింఛన్ నిలుపుదల చేస్తామని తెలిపారు. దరఖాస్తు చేయని వారికి పింఛన్ నిలుపుదల చేస్తామన్నారు.

మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల మరమ్మతులు

మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల మరమ్మతులు, కాలువలలో పూడికతీత పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భూగర్భ జలాలు పెంచేందుకు నీటి సంరక్షణ పనులను విరివిగా చేపట్టాలన్నారు. ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఏపీ సీపీడీసీఎల్ ఎస్ఈ ఆంజనేయులు, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వేటపాలెం: మోటర్ బైక్ పై రోడ్డు క్రాస్ చేస్తున్న వ్యక్తిని వేగంగా వచ్చిన మినీ లారీ ఢీ కొట్టిన సంఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో రెస్టారెంట్‌ల వద్ద గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. పాత చీరాలకు చెందిన శవనం శ్రీ హరి రెడ్డి తన మోటార్ బైక్‌పై రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో చీరాల వైపు నుంచి వేగంగా ఒంగోలు వైపునకు వెళుతున్న మినీ లారీ ఢీ కొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తి ఎగిరి రోడ్డు పై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడి వ్యక్తిని అంబులెన్స్‌లో చీరాల ప్రైవేట్‌లో చికిత్సనిమిత్తం చేర్చారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొణిదెనలో ఘర్షణ

బల్లికురవ: మండలంలోని కోణిదెన గ్రామంలోని ఎస్సీ కాలనీలో మద్యం మత్తుతో జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాలకు సంబంధించి 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వై. నాగరాజు గురువారం తెలిపారు. గెల్లా శంకరయ్య, మద్యం మత్తుతో బుధవారం సాయంత్రం దూషణకు దిగడంతో రెండు వర్గాల మధ్య వివాదం నెలకొని.. కొట్లాటకు దారితీసింది. గెల్లా దేవేంద్ర ఫిర్యాదు మేరకు 5 గురిపై.. గెల్లా వెంకటేష్ ఫిర్యాదుపై 6 గురిపై కేసులు నమోదుతో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఇరువర్గాలు గొడవలకు పాల్పడకుండా 11 మందిని బైండోవర్ చేశామని తహసీల్దార్ ఎదుట శుక్రవారం హాజరు పరచనున్నట్లు ఎస్సై వివరించారు.


రేపల్లెలో వర్తక సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడు


భట్టువారిపాలెంలో


భట్టిప్రోలు మండలం ఐలవరంలో...


భట్టిప్రోలు పరిధిలోని అద్దేపల్లిలో...


కర్లపాలెం కాళికాంబ సమేత వీరభద్రస్వామి ఆలయంలో కొలువై ఉన్న విఘ్నేశ్వరుడు


రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేషుని విగ్రహం

వినాయక చవితి వేడుకలు బాపట్ల జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారుల వెంటే కాకుండా వీధి వీధినా గణపతిని కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఇక ఇళ్లల్లో, బహుళ అంతస్తుల భవనాల ఆవరణలో గణపతి ప్రతిమలను ప్రత్యేకంగా ప్రతిష్ఠించారు. విశేష అలంకరణలు చేశారు. చిన్నారులు, యువత, మహిళలు పెద్దసంఖ్యలో వేడుకల్లో పాల్గొంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన ఎస్పీ దంపతులు

బాపట్లటౌన్: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లా ఏఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని పూజా కార్యక్రమంలో బుధవారం ఎస్పీ దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ పండుగలను ఒక కుటుంబ వాతావరణంలో జరుపుకోవడంతో పోలీస్ సిబ్బంది మధ్య స్నేహభావం, ఐక్యత మరింతగా పెంపొందుతాయన్నారు. ప్రజల రక్షణ, భద్రత కోసం నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉన్న పోలీస్ సిబ్బంది పండుగలను ఉత్సాహభరితంగా జరుపుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. వినాయక చవితి వంటి పండుగలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. జిల్లాలో వినాయక చవితి పందిర్లు/మండపాలను ఏర్పాటు చేసుకున్న ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ వారి సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.


గణనాథునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ దంపతులు

ఎక్కడైనా ఏవైనా అవాంఛనీయ ఘటనలు తలెత్తితే డయల్ 100, 112 నెంబర్లకు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయ సారథి, ఎస్‌బి సీఐ నారాయణ, రిజర్వ్ సీఐ మౌలుద్దీన్, బాపట్ల టౌన్ సీఐ ఆర్.రాంబాబు, రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, సర్కిల్ సీఐ బి.హరికృష్ణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాటం

సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి బాబూరావు

చీరాల అర్బన్: బషీర్‌బాగ్ కాల్పుల్లో ఆశువులు బాసిన విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో నేడు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు వామపక్షాలు, ప్రజా సంఘాలు పూనుకున్నాయని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి ఎస్.బాబూరావు అన్నారు. 2000 ఆగస్టు 28న హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ వ్యతిరేక ఉద్యమంపై చంద్రబాబు ప్రభుత్వం పోలీసు కాల్పుల దమనకాండలో విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి అనే ముగ్గురు కార్యకర్తలు అశువులు బాసి నేటికీ 25 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న విద్యుత్ అమరవీరుల సంస్మరణ ప్రతిజ్ఞ దినం కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ గురువారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పేద ప్రజలను దోపిడీకి గురిచేసి ప్రభుత్వ విధానాలను అందరూ కలిసి ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ పంపిణీ, నిర్వహణ వ్యవస్థలను ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్రం, ఆంధ్రప్రదేశ్‌లో ఎవరు అధికారంలో ఉన్నా ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలనే అమలు చేస్తున్నారని, దీనిలో భాగంగానే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని మొత్తం అదాని వంటి కార్పొరేట్లకు కట్ట బెడుతుందన్నారు. దీని ఫలితంగా ప్రజలపై భారాలు పడుతున్నాయన్నారు. ప్రజా పోరాటం ద్వారా ఈ సంస్కరణలకు పాతర వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తమకు అధికారం ఇస్తే స్మార్ట్ మీటర్ల చార్జీలు.. అదనపు చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేస్తామని హామీ ఇచ్చి.. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం మాట మార్చిందన్నారు. అవే స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలను యథావిధిగా ప్రజలపై వేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.


ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.వసంతరావు, డి.నారపరెడ్డి, ఎల్.జయరాజు, ఐవీ ప్రసాద్, బి.సుబ్బారావు, ఇమ్మానియేలు, సీపీఐ నాయకులు బత్తుల సామేలు, పైడియ్య, ప్రజాసంఘాల నాయకులు మాచర్ల మోహనరావు, చుండూరి వాసు, బలహీనవర్గాల సమాఖ్య నాయకులు గోసాల ఆశీర్వాదం, తాటిబోయిన లక్ష్మీప్రసాద్, శీలం వెంకటేశ్వర్లు, ఎస్.మోహన్‌కుమార్ ధర్మా తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనాల్లో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: వినాయక నిమజ్జనాల్లో కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భక్తులు వినాయక విగ్రహాల నిమజ్జనాలను ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకల్లో దిగరాదన్నారు. కల్వర్టులు, చప్టాలపై వరద నీరు పొంగి ప్రవహిస్తున్నప్పుడు వాటిని దాటే ప్రయత్నం చేయరాదన్నారు. నిర్లక్ష్యం వలన ప్రాణాలకు ముప్పు కలిగే ప్రమాదం ఉందన్నారు. వినాయక నిమజ్జన ఊరేగింపులు శాంతియుతంగా, సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. ఇతర మతాలు, వర్గాలు, వ్యక్తులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు, నినాదాలు, చేయరాదన్నారు. ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం తాగిన వారు ఊరేగింపులో, నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనకుండా కమిటీ సభ్యులే చూసుకోవాలన్నారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదు. అసభ్యకర వేషధారణలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించరాదన్నారు. వృద్ధులు, చిన్నారులను నిమజ్జన కార్యక్రమాలకు దూరంగా ఉంచాలన్నారు. ఊరేగింపు సమయంలో రంగులు చల్లడం, బాణాసంచా పేల్చడం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉన్నా, పోలీస్ శాఖ సహకారం అవసరమైన వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు, టోల్ ఫ్రీ నెంబర్ 112 కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

శ్రీశైల గాయత్రి పీఠాధిపతిగా రామారావు



వేటపాలెం: శ్రీశైల గాయత్రి పీఠాధిపతులుగా రావూరిపేటకు చెందిన జ్యోతిర్విద్వాన్.. దేవాంగ పురోహిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు చల్లా రామారావు ఎంపికయ్యారు. దేవాంగ కుల ద్వితీయ గురు పీఠం శ్రీశైలం గాయత్రి పీఠం అని, పీఠం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 26న చీరాల్లో పూర్తి చేసినట్లు ప్రధాన కార్యదర్శి అంబాబత్తుల అండకొండ రాముడు గురువారం వెల్లడించారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఈ పీఠాన్ని రావూరిపేటలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని కార్యక్రమాలు పూర్తయిన తర్వాత శ్రీశైలంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పీఠం సభ్యులు చల్లా లక్ష్మణరావు, పన్నెం బాలశంకరరావు, సజ్జా విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో ఐదుగురు జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం గ్రామంలోని సమీప పశువుల కొష్టాల వద్ద పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో దాడి చేసినట్లు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. పేక ముక్కలతో పాటు, సెల్‌ఫోన్‌లు, రూ. 1120 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

31న జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలు

నరసరావుపేట రూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ టెన్నికాయిట్ ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు నిడికొండ జానకిరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి సెప్టెంబర్ 13, 14వ తేదీలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్ విభాగంలో క్రీడాకారులు 01-01-2011, జూనియర్ విభాగంలో పాల్గొనే వారు 01-01-2007 తరువాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. పోటీలకు హాజరయ్యే వారు వయసు ధ్రువీకరణపత్రంతో రావాలని సూచించారు. పూర్తి వివరాలకు పి.తిరుపతిరావు – 97016 18000, ఝాన్సీ రాణి – 99495 33234 ఫోను నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఆచార్య నాగార్జునుడి బోధనలు ఆచరణీయం

చికాగో బౌద్ధాలయం సందర్శనలో శివనాగిరెడ్డి

విజయపురి సౌత్: ఆచార్య నాగార్జునుడి బోధనలు నేటికీ ఆచరణీయమని ప్రముఖ బౌద్ధ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఈ మేరకు మిడ్ వెస్ట్ బౌద్ధాలయాన్ని గురువారం సందర్శించిన సందర్భంగా ఆయన ప్రసంగించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య నాగార్జునుడి మధ్యమమార్గం, శూన్యవాదం, నైతిక వర్తన, సచ్ఛీలత, వివేకం, శాశ్వతానందాన్నిచ్చే బుద్ధుని చతురార్య సత్యాలు, ఆర్య అష్టాంగిక మార్గాలను ఆచరిస్తే ప్రస్తుత సమాజంలోని రుగ్మతలను నిర్మూలించవచ్చని తన ప్రసంగంలో ఆయన వివరించారు. బౌద్ధ సంస్కృతిని పరిరక్షించటానికి తెలంగాణ రాష్ట్రంలోని నాగార్జునసాగర్ హిల్ కాలనీలో బుద్ధవనాన్ని నిర్మించారని గుర్తుచేశారు. అనంతరం ఆలయ ప్రధానాచార్యులు పూజ్య గ్యాదో కోనో వారి ప్రచురణలను శివనాగిరెడ్డికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో చికాగో సాహితీ మిత్రులు, సంస్థ కార్యదర్శి జయదేవ్ మెట్టుపల్లి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈమని శివనాగిరెడ్డి

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఎదుర్కొందాం

బాపట్ల: విద్యుత్ ఛార్జీల వ్యతిరేక పోరాటంలో 2000 సంవత్సరంలో హైదరాబాదులో బషీర్ బాగ్ వద్ద అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లను రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. గురువారం వామపక్ష పార్టీలు ఇతర ప్రజా సంఘాల నాయకులతో కలిసి బాపట్ల పాత బస్టాండ్ సెంటర్లో స్మార్ట్ మీటర్లు రద్దు అయ్యే వరకు పోరాటం ఆగదని ప్రతిజ్ఞ చేశారు. గంగయ్య మాట్లాడుతూ ఈ విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని అరికట్టడానికి ప్రజల్ని పెద్ద సంఖ్యలో కదిలించాలని అందుకు వామపక్ష పార్టీలు ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఒక్కో మీటర్‌కు రూ. 30వేలు ఖర్చుపెట్టి మీటర్ల బిగించిన అనంతరం ఆ సొమ్ము మన వద్దే వాయిదాల పద్ధతిలో వసూలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మజుందార్, కొండయ్య, శరత్, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, భాస్కర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి, బీఎస్పీ నాయకులు రాజారావు, సమాజ్‌వాది పార్టీ నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గంగయ్య

జాయింట్ డైరెక్టర్‌గా శ్రీనివాసులురెడ్డికి పదోన్నతి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న గుర్రం శ్రీనివాసులురెడ్డికి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. జాయింట్ డైరెక్టర్‌గా ప్రమోషన్ ఇచ్చి విజయవాడ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయంలో పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చారు. చిత్తూరు జిల్లా మదనపల్లి మండలం గుర్రంకొండ గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి 1986లో చిత్తూరులో ఏపీఎస్ ఆర్టీసీలో కండక్టర్‌గా విధుల్లో చేరి, ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించారు. అనంతరం డెప్యూటీ సెక్షన్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంది తిరుపతి బదిలీ అయ్యారు. 1996లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఏపీఎస్ ఆర్టీసీలో పదోన్నతి వచ్చింది. ఏపీపీఎస్ ద్వారా గ్రూప్-1 రాసి, 1998లో ప్రమోషన్ పొంది తిరుపతి రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏవోగా విధుల్లో చేరారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా 2001లో పదోన్నతి పొంది, హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి బదిలీ అయ్యారు. డెప్యూటీ డైరెక్టర్‌గా 2005లో ప్రమోషన్ పొంది, హైదరాబాద్ ఆర్డీ కార్యాలయానికి వెళ్లారు. మూడేళ్లుగా గుంటూరులో మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయంలో డీడీగా పనిచేస్తున్నారు. జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన శ్రీనివాసులురెడ్డికి రీజనల్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు సత్యం, రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్‌లు, పలువురు వైద్యులు, అధికారులు అభినందనలు తెలిపారు.

డీడీగా పాల్ సుధాకర్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ బి.పాల్‌సుధాకర్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె.పద్మావతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పాల్ సుధాకర్ గుంటూరు వైద్య కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డెప్యూటీ డైరెక్టర్‌ల పదోన్నతి జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. సదరు జాబితాలో పాల్ సుధాకర్ డీడీగా పదోన్నతి పొందారు.

గంజాయి వినియోగిస్తున్న ఐదుగురి అరెస్ట్

1.15 కేజీల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి రూరల్: త్రీ టౌన్ పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి వినియోగిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎస్. రమేష్‌బాబు వెల్లడించిన వివరాల ప్రకారం.... బాలాజీరావుపేటలో డాక్టర్ మస్తానమ్మకు చెందిన ఖాళీ స్థలంలో కొందరు గంజాయి వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఘటనా స్థలంలో మహేంద్రదేవ్ కాలనీకి చెందిన పాలడుగు బాలకృష్ణ, గంగానమ్మపేటకు చెందిన సయ్యద్ ముజాయిద్, వేమూరు మండలం పెరవలి గ్రామానికి చెందిన పోతార్లంక కార్తీక్, బాలాజీరావుపేటకు చెందిన యలవర్తి శివకుమార్, చెంచుపేటకు చెందిన షేక్ సమీర్ హుస్సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1.15 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పాలడుగు బాలకృష్ణ, సయ్యద్ ముజాయిద్ ఒడిశా నుంచి గంజాయి తెచ్చి మిగిలిన నిందితులతో కలిసి తెనాలి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. గంజాయికి బానిసలైనట్లు తెలిస్తే తల్లిదండ్రులు వెంటనే పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకొస్తే కౌన్సెలింగ్ నిర్వహించి, అవసరమైతే రిహాబిలిటేషన్ సెంటర్‌లకు పంపనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



సత్తెనపల్లి: ఈ నెల 30, 31వ తేదీలలో మహిళలకు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల సమీపంలోని లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 30, 31వ తేదీలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా అమెచ్యూర్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇ. వంశీకృష్ణారెడ్డి, పి.సామంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆహ్వాన పత్రాన్ని డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోన రవి కుమార్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఎ.రవి నాయుడు హాజరవుతారన్నారు. 13 జిల్లాల టీములు పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, అడ్మిషన్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర ర్యాంకింగ్ క్యారమ్స్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ స్టేట్ 2వ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్ ఈ నెల 30, 31వ తేదీల్లో ఆంధ్ర రాష్ట్ర క్యారమ్స్ సంఘం పర్యవేక్షణలో పల్నాడు జిల్లా క్యారమ్స్ సంఘం, సీఆర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ గురువారం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేటలోని సీఆర్ క్లబ్‌లో పురుషులకు, మహిళలకు వేరుగా పోటీలు ఉంటాయని చెప్పారు. దాదాపు 150 మంది పాల్గొంటారని, వారికి వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిభావంతులైన ఆరుగురిని ఏపీ స్టేట్ క్యారమ్స్ జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు. 10 మంది రిఫరీలుగా వ్యవహరిస్తారన్నారు. క్రీడాకారులకు ట్రోఫీతో పాటు రూ.30 వేలు నగదు అందజేస్తామని పేర్కొన్నారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో గందరగోళం

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గందరగోళంగా మారిందని ఏపీటీఎఫ్ (1938) గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నరసింహారావు ఓ ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ అభ్యర్థులు చాలామంది తమకు ఎటువంటి మెసేజెస్ రాలేదని చెప్పారన్నారు. అసలు ఏ కేటగిరీ వారికి ఎంత కటాఫ్ అనేది ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి, దాని ప్రకారం వెరిఫికేషన్‌కు అభ్యర్థులను పిలిస్తే ఎవరికి ఎటువంటి అనుమానం, ఇబ్బంది ఉండదన్నారు. మెసేజెస్ వచ్చిన వారే వెరిఫికేషన్‌కు రావాలని ప్రభుత్వం చెప్పడం రిజర్వేషన్ అభ్యర్థులుకు అనేక అనుమానాలు కలిగి ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ గందరగోళానికి తెర దించాలని డిమాండ్ చేశారు. ఒక అభ్యర్థి రెండు లేదా అంతకంటే ఎక్కువ పోస్టులకు సెలెక్ట్ అయితే నచ్చిన పోస్టు సెలెక్ట్ చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.